నిట్‌లో హైడ్రో ఇంటర్నేషనల్ సదస్సు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 22 : వరంగల్ నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో హైడ్రో-2023 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగనుంది. 38 సెషన్లలో 400 పేపర్ల ప్రదర్శన ఉంటుందని నిర్వామకులు చెప్పారు. హైడ్రాలిక్స్, నీటి వనరులు, నదీ తీరప్రాంత ఇంజినీరింగ్, కీలకమైన డొమైన్‌లలో ఆవిష్కరణ, సహకారం పెంపొందించడం ఈ సదస్సు లక్ష్యమని వారు తెలిపారు.

నర్సంపేట డివిజన్‌కు వెయ్యి గిఫ్టులు

నర్సంపేట రూరల్, డిసెంబర్ 22: నర్సంపేట డివిజన్‌కు వెయ్యి క్రిస్మస్ కానుకలు వచ్చాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గిఫ్ట్ ప్యాక్ కాటన్లను సిబ్బంది భద్రపర్చారు. శనివారం పట్టణంలోని ద్వారకపేట ఎంఏఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి డివిజన్‌లోని చెన్నారావుపేట, నర్సంపేట, నల్లబెల్లి, నెక్కొండ, ఖానాపురం, దుగ్గొండి మండలాలకు 1000 గిఫ్ట్ ప్యాక్‌లు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

వధూవరులకు పెద్ది దంపతుల ఆశీర్వాదం

వధూవరులను ఆశీర్వదిస్తున్న పెద్ది దంపతులు

నర్సంపేట, డిసెంబర్ 22: దుగ్గొండి ఎంపీపీ కాట్ల కోమలాభద్రయ్య కుమారుడు ప్రవీణ్‌కు మార్-యమున వివాహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న దంపతులు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ డివిజన్ ప్రజాప్రతినిధులు, నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు ఉన్నారు.

మంత్రి కొండా సురేఖకు పలువురి శుభాకాంక్షలు

కొండా సురేఖకు పుష్పగుచ్ఛం ఇస్తున్న షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్/ఖిలావరంగల్/గిర్మాజీపేట, డిసెంబర్ 22 : రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కూడా మంత్రి సురేఖను మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, భద్రకాళీ ట్యాంక్‌బండ్ ఏరియా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. భద్రకాళీ బండ్ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా ప్రకటించాలని కోరారు.

పీపీ సత్యనారాయణకు బెస్ట్ స్పీకర్ అవార్డు

సత్యనారాయణకు అవార్డు అందజేస్తున్న అనిల్ కిశోర్, బీకే శర్మ

వరంగల్ లీగల్, డిసెంబర్ 22 : వరంగల్ ప్రాసిక్యూషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ మొకీల సత్యనారాయణను జాతీయ పోలీసు అకాడమీ బెస్ట్ స్పీకర్ అవార్డుకు ఎంపిక చేసింది. భోపాల్‌లోని ప్రతిష్టాత్మక జాతీయ పోలీసు అకాడమీలో వంద మంది డిప్యూటీ సూపరింటెండెంట్లకు రెండు రోజులుగా శిక్షణ ఇచ్చారు. నేర విచారణ ప్రక్రియలో సాక్ష్యాల సేకరణ అనే అంశంపై సత్యనారాయణ ఇచ్చిన స్పీచ్‌కు బెస్ట్ స్పీకర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ డైరెక్టర్ అనిల్ కిశోర్ యాదవ్ తెలిపారు. సంస్థ అదనపు డైరెక్టర్ బీకే శర్మతో కలిసి శుక్రవారం అవార్డు ప్రదానం చేశారు.

26 నుంచి లోక్ అదాలత్

పోచమ్మమైదాన్, డిసెంబర్ 22 : డ్రైవింగ్ సందర్భంగా నమోదైన కేసుల పరిష్కారానికి ఈ నెల 26 నుంచి 30 వరకు హనుమకొండ సెకండ్ క్లాస్‌లో కోర్టులు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మట్టెవాడ ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో బాధితులు ఆధార్‌కార్డు, ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, మీసేవలో దరఖాస్తు చేసుకున్న రసీదు, మైనర్లు బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ మెమోతో రావాలని సూచించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

- దీప్తి సక్సెస్ యువతకు మార్గదర్శకం
- సన్మాన సభలో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

విలువిద్య క్రీడలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పర్వతగిరి, డిసెంబర్ 22: చిన్న గ్రామంలో చదువుకుని, క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న దీప్తి ఈ ప్రాంత యువతకు మార్గదర్శకమని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పారా ఏషియన్ క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన జీవంజి దీప్తికి మండలంలోని కల్లెడలో ఆర్డీఎఫ్ వనిత అచ్యుతా పాయ్ కళాశాలలో శుక్రవారం సన్మాన సభ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ప్రతిభ కనబరిచి, అనేక పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడి విద్యార్థులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. దీప్తి కృషి, పట్టుదలతో కల్లెడ గ్రామంతోపాటు వరంగల్ జిల్లాకు జాతీయస్థాయిలో మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. క్రీడల్లో రాణించాలనే ఆసక్తితో చిన్నప్పటి నుంచి ముందుకు సాగుతున్న దీప్తి సక్సెస్‌కు తల్లిదండ్రులు, కోచ్‌తోపాటు చాలామంది ప్రోత్సాహం ఉందన్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఉపాధ్యాయులు, ఆర్డీఎఫ్ ఫౌండేషన్ దీప్తికి సహాయ సహకారాలు అందించడం హర్షణీయమన్నారు. దీప్తి కలలను నెరవేర్చడంలో అందరి సహకారం ఉందన్నారు. పారా ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకాన్ని సాధించి, ప్రధాని మోదీతో స్వయంగా ప్రశంసలు పొందిన దీప్తిని యువత ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఆర్చరీ క్రీడను పరిశీలించి పిల్లలతో సరదాగా గడిపారు. అనంతరం పర్వతగిరిలోని గురుకులంలో సైన్స్ ఫేర్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అశోకాచారి, డైరెక్టర్లు సబిత, రచన, దీప్తి కోచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలి'

గిర్మాజీపేట, డిసెంబర్ 22: రానున్న పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈవో డీ వాసంతి తెలిపారు. శుక్రవారం ఆమె జిల్లాలోని 10 కేజీబీవీ పాఠశాలల స్పెషలాఫీసర్లు, 6 మోడల్‌స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వివిధ కారణాలతో డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి, తిరిగి పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈవో సూచించారు. ప్రతీ విద్యార్థి ధారాళంగా చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యాస దీపికల సహాయంతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన ప్రగతికి సంబంధించిన విద్యాపరమైన కార్యక్రమాలని పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు. కార్యక్రమంలో జీసీడీవో ఫ్లోరెన్స్, స్పెషలాఫీసర్లు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు పదేళ్ల జైలు

అత్తకు 7 ఏండ్ల శిక్ష, జరిమానా

పర్వతగిరి, డిసెంబర్ 22 : భార్య మృతికి కారణమైన భర్తకు పదేళ్ల శిక్ష, అత్తకు ఏడేళ్ల శిక్షతోపాటు జరిమానా విధిస్తూ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై సత్యేంద్ర తీర్పు వెలువరించినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన నల్లపు భిక్షపతి కూతురు అంజలి(23)ని పదేళ్ల క్రితం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన సంగెం నరేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. రెండేళ్ల తర్వాత భర్త నరేశ్, అతడి తల్లి విజయ అదనపు కట్నం కోసం అంజలిని వేధిస్తూ చిత్రహింసలకు గురిచేశారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అంజలి 2016 ఆగస్టులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, అప్పటి మామునూరు ఏసీపీ మహేందర్ విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై సత్యేంద్ర సంచలన తీర్పును వెలువరించారు. బాధితుల వాంగ్మూలాన్ని పరిశీలించి నరేశ్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.2.10 లక్షల జరిమానా, విజయకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధించారు. కాగా, కేసు పరిష్కరించిన ఏసీపీ మహేందర్‌తో పాటు కోర్టు కానిస్టేబుల్ మోహన్, హోంగార్డు సదయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణను వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ

కట్టయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు/దామెర, డిసెంబర్ 22: పెంచికపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మందపల్లి కట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, సర్పంచ్ కోరె లలితారమేశ్, ఎంపీటీసీ మందపల్లి మమతా రవీందర్, నాయకుడు గండు రాము ఉన్నారు. అలాగే, దామెర మండలంలోని ఊరుగొండకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆరె వెంకట్‌రెడ్డి తల్లి కమలమ్మ, ఇదే గ్రామానికి చెందిన జన్ను సారయ్య మృతి చెందగా, బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ గండు రాము, ఉపసర్పంచ్ విద్యాసాగర్, మాజీ సర్పంచ్‌లు సమ్మిరెడ్డి, జక్కుల రాణీ రవీందర్ ఉన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటే..

- ప్రజలు ఆ పార్టీని తరిమికొట్టడం ఖాయం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- ఎంపీల సస్పెన్షన్‌పై పలు చోట్ల నిరసనలు

హనుమకొండ, డిసెంబర్ 22 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజలు బీజేపీని తరిమికొట్టడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసుకునేందుకే విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారని విమర్శించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేశారన్నారు. పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ఇస్తూ పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మండ సదాలక్ష్మి, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

హనుమకొండ చౌరస్తా/నర్సంపేట/ఖిలావరంగల్/రాయపర్తి : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని తప్పుబడుతూ హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం జంక్షన్‌లో ఆ పార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మోదీకో హఠావో.. దేశ్‌కో బచావో అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, పోతుల శ్రీమాన్, విజయశ్రీ రజాలి పాల్గొన్నారు. అలాగే, నర్సంపేటలోని వరంగల్ రోడ్డు కూడలిలో కాంగ్రెస్ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే, ఎంపీలపై నిషేధం ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు. న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, బాషుమియా, లాదెళ్ల శరత్, హరిబాబు, యాకూబ్, సుధీర్ పాల్గొన్నారు. రాయపర్తి మండలంలోని కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్, నాయకులు మాచర్ల ప్రభాకర్, సరికొండ కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, వెంకటేశ్, భగవాన్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్

గిర్మాజీపేట, డిసెంబర్ 22 : వరంగల్ కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వృద్ధులకు శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మాచర్ల శారద తెలిపారు. ప్రతి నెల నాలుగో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రీవెన్స్ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

శాయంపేట ఎంపీడీవో బదిలీ

శాయంపేట, డిసెంబర్ 22: ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆత్మకూరు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డిబార్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 22: కేయూ పరిధిలో జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం 8 మంది డిబార్ అయినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. వీరిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని వారు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన హార్వెస్టర్

ఒకరు మృతి.. కేసు నమోదు

నారాయణ(ఫైల్)

శాయంపేట, డిసెంబర్ 22 : బైక్‌ను హార్వెస్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం నిజాంపల్లికి చెందిన ఎల్లబోయిన నారాయణ(43) తాపీ పని చేస్తుండేవాడు. పని కోసం శుక్రవారం వరంగల్‌కు వెళ్లాడు. తిరిగి రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా, గంగిరేణిగూడెం బతుకమ్మ విగ్రహం వద్ద హార్వెస్టర్ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సునీత ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన సూర్యాపేట జిల్లా మటంపల్లికి చెందిన బానోత్ సైదులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన లారీ

వర్ధన్నపేట, డిసెంబర్ 22 : హార్వెస్టర్‌ను తీసుకెళ్తున్న డీసీఎం వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన ఇల్లంద శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న డీసీఎం ఇంజిన్‌లో సమస్య రావడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో ఖమ్మం వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో డీసీఎంలో నిద్రిస్తున్న డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

రాయపర్తి, డిసెంబర్ 22: కొత్తూరుకు చెందిన వివాహిత వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు. బంధన్‌పల్లికి చెందిన గోరుకంటి లక్ష్మి తన కుమార్తె సమత(19)ను కొత్తూరుకు చెందిన వడ్డె లక్ష్మణ్‌కు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించింది. సమత-లక్ష్మణ్ దంపతులకు 11 నెలల కుమారుడు ఉన్నాడు. ఈ నెల 21న సమత పురుగుల మందు తాగింది. స్థానికులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కారులోకి దూసుకెళ్లిన చువ్వలు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 22 : వ్యాన్ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఇనుప చువ్వలు కారుపైకి దూసుకెళ్లిన ఘటన నర్సంపేట మండలం మహేశ్వరం వద్ద శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఇనుప చువ్వల లోడ్‌తో డీసీఎం వ్యాన్ నర్సంపేటకు వస్తున్నది. మహేశ్వరం వద్ద ఎదురుగా ఓ వాహనం రావడంతో డీసీఎం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ఇనుప చువ్వలు నర్సంపేట వరంగల్ వైపు వెళ్తున్న కారులోకి దూసుకెళ్లాయి. కారులో ప్రయాణిస్తున్న వారు అప్రమత్తమై తప్పించుకోవడంతో ప్రమాదం తప్పింది.

ఏసీపీ కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట, డిసెంబర్ 22: నర్సంపేట ఏసీపీ తిరుమల్ కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తిరుమల్ తండ్రి నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ, నాయకులు బాల్నె వెంకన్న, బుర్రి తిరుపతి, జక్క అశోక్, భిక్షపతి, సర్పంచ్ కుండె మల్లయ్య పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 23మందికి జరిమానా

సుబేదారి, డిసెంబర్ 22 : డ్రైంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 23మందికి రూ.32,700 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.1,200 జరిమానా విధించామని చెప్పారు.

33 మందికి కు.ని ఆపరేషన్లు

ధర్మసాగర్, డిసెంబర్ 22 : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 33 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు డాక్టర్ గోపినాథ్ చెప్పారు. కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్‌పాషా హాజరయ్యారు.

'మెడికేర్'లో అరుదైన శస్త్రచికిత్స

కరీమాబాద్, డిసెంబర్ 22 ఉర్సు బైపాస్ రోడ్డులోని మెడికేర్ ఆస్పత్రిలో వైద్యులు శుక్రవారం అరుదైన చికిత్స చేశారు. కడుపునొప్పితో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి ఆపరేషన్ చేసి కడుపులో నుంచి ఏడున్నర కిలోల కణతిని తొలగించారు. దవాఖాన డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్ ఫాదర్ చిన్నపరెడ్డి వైద్య బృందాన్ని అభినందించారు.

'ప్రతి ఒక్కరూ మాస్క్‌లు ధరించాలి'

నల్లబెల్లి/సంగెం, డిసెంబర్ 22: కరోనా మళ్లీ విజృంభిస్తున్నందున ప్రజలు మాస్కులు ధరిస్తూ సామాజిక దూరం పాటించాలని వైద్యాధికారి శశికుమార్ సూచించారు. మేడెపల్లి పీహెచ్‌సీలో ఆయన శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే, సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి కరోనాపై ప్రజాప్రతినిధులు, అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని సూచించారు. జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో కాసర్ల రవీందర్, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, డాక్టర్ ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Computer Operators, GNM Nurses, OT-Technicians & Compounders. Cont: Guardian Hospital, Opp: L.B. College, Warangal. Time: 12pm to 2 pm.
NTW-0325

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

CHANGE OF NAME
I, SHINY DOMY (New Name), previously called SHAINY MOL V.S. (Old Name), and R/o. H.No. 1-92/C, Ghanpur (Stn.), Village of Ghanpur (Stn.) Mandal, Jangaon District-506144, T.S., India. and solemnly declare both are same.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కరపత్రాలతో మహిళలు

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

హనుమకొండ, డిసెంబర్ 22 : చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని మిల్లెట్ కుకింగ్ ఎక్స్‌పర్ట్ కుసుమ కవిత అన్నారు. శుక్రవారం హనుమకొండ శ్రీనగర్ కాలనీలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో చిరుధాన్యాలను భాగంగా చేసుకోవాలని సూచించారు. వారి రికార్డ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చిరుధాన్యాల అవగాహనపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మిల్లెట్స్ గురించి సలహాలు, సూచనలకు 91003 73129 నంబర్‌లో సంప్రదించాలని కవిత సూచించారు. కార్యక్రమంలో సత్యవాణి, సౌజన్య, పద్మ పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె'

కాజీపేట, డిసెంబర్ 22 : కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎస్ భరణి భాను ప్రసాద్ అన్నారు. కాజీపేటలోని సంఘ్ కార్యాలయంలో శుక్రవారం డివిజనల్ కౌన్సిల్ సమావేశాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 8 నుంచి 11 వరకు రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శిలు ఎన్‌వీఎన్ చౌదరి, ప్రభు రాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు అనూష

గీసుగొండ, డిసెంబర్ 22: గొర్రెకుంట జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న అనూష జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రఘువీర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 27న భువనేశ్వర్‌లో జర